ఒక్కేసి పువ్వేసి చందమామ

వైభవంగా కూకట్‌పల్లి బతుకమ్మ సంబురాలు



కొత్తూరు సీతయ్యనగర్‌లో బతుకమ్మ వేడుకల్లో రాష్ట్ర బీజేపీ లీగల్ సెల్ సభ్యురాలు సద్గుణరెడ్డి



బాల బతుకమ్మలతో చిన్నారులు

కూకట్‌పల్లి : కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఆదివారం జరిగిన బతుకమ్మ సంబురాలకు మహిళలు భారీ ఎత్తున తరలి వచ్చారు. సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మలను తీసుకొచ్చి ఆడిపాడారు. కూకట్‌పల్లిలోని హనుమాన్‌చౌక్, వెంకట్‌రావు నగర్ కాలనీ, దేవిస్థాన్ హోమ్స్ తదితర ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకలతో తెలంగాణ సంస్కృతి ఉట్టిపడింది. దేవిస్థాన్ హోమ్స్‌లో అబ్బినేని దేవి, అబ్బినేని అంజన తయారు చేసిన పెద్ద బతుకమ్మ అందరినీ ఆకట్టుకుంది. పట్లూరి కావ్య తులసి కోట ఆకారంలో బతుకమ్మను తయారు చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ఆమె తయారు చేసిన బతుకమ్మ వద్ద సెల్ఫీలు దిగుతూ కనిపించారు. అనంతరం ఐడీఎల్ చెరువులో నిమజ్జనం చేసేందుకు మహిళలు బతుకమ్మలను తీసుకొని వెళ్లారు.











తులసి కోట ఆకారంలో బతుకమ్మ

18న ఎగ్జిబిషన్-కమ్-సేల్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ధనక్ బజార్-ఎగ్జిబిషన్-కమ్ సేల్ ను ఈనెల 18వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు 'మనూ' లేడీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ ఎం వనజ ఆదివారం తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయం లేడీస్ అసోసియేసన్, ది సఫా ఎన్‌జీఓ సంస్థ ఆధ్వర్యంలో 18న ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో అందరికీ అందుబాటులో ఉండేలా నిర్వహిస్తామని వివరించారు.

ఒరిస్సా ఉత్కల్ మని గోపాబంద్ దాస్ జయంతి వేడుకలు

హఫీజ్‌పేట్: ఒరిస్సా ఉత్కల్ మని గోపాబంద్ దాస్ నాల్గవ జయంతి వేడుకలు, అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం ఆదివారం చందానగర్‌లోని క్రిస్టల గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా కేంద్ర మంత్రి ప్రతాప్ చంద్ర సారంగి, రాష్ట్ర కార్యవర్గ స భ్యులు రవికుమార్ యాదవ్‌లు హాజరయ్యారు.

ఇది అన్ని వర్గాలకు ఉపయోగపడే మేనిఫెస్టో

• కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



జంగ్ 2023 తెలంగాణ

కూకట్‌పల్లి: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం ప్రకటించిన మేనిఫెస్టో సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన పదేళ్లలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి దేశంలో మరెక్కడా లేదన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన హామీల కంటే 90శాతం అధికంగా నిరుపేదలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారికి పెద్దన్నగా నిలిచారని తెలిపారు. ఇది అన్నివర్గాలకు ఉపయోగపడే మేనిఫెస్టో అని అన్నారు. ప్రజలకు ఆరోగ్య బీమా, అర్హులకు గ్యాస్ సిలిండర్ రూ.400కే పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు వెళ్లటమే కాకుండా మరో లక్ష బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించేందుకు నిర్ణయం తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎప్పుడు పేదల పక్షాన ఆలోచించే ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల కుటుంబాలకు పెద్ద దిక్కుగా నిలుస్తూ ఆసరా పింఛన్లు అందిస్తున్నారన్నారు.

◆ నేడు ప్రకటించిన కొత్త పథకాలు కేసీఆర్ బీమా - ప్రతి ఇంటికి ధీమా, తెలంగాణ అన్నపూర్ణ - సన్న బియ్యం పంపిణీ, ఆసరా పింఛన్లు 5వేలకు పెంపు, దివ్యాంగుల పింఛన్లు 6వేలకు పెంపు, రైతుబంధు 16 వేలకు పెంపు, సౌభాగ్యలక్ష్మి - పేద మహిళలకు రూ.3వేల భృతి, అక్రెడిటెడ్ జర్నలిస్టులు, అర్హులైన వారికి రూ.400లకే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.15లక్షలకు పెంపు, కేసీఆర్ ఆరోగ్య రక్ష - ప్రభుత్వ ఉద్యోగుల వలే జర్నలిస్టులకు ప్రత్యేక వైద్య సేవలు, దళితబంధు కొనసాగింపు, హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం, అగ్రవర్ణ పేదలకు 119 గురుకులాలు ఏర్పాటు, అనాథ పిల్లల భవిత కోసం ప్రత్యేక పాలసీ అమలు, అసైన్డ్ ల్యాండ్‌పై ఆంక్షల ఎత్తివేతకు చర్యలు, సీపీఎస్ నుంచి ఓపీఎస్‌ల సాధ్యాసాధ్యాలపై అధ్యయనానికి కమిటీ ఏర్పాటు వంటి అనేక పథకాలు నిరుపేదలకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

మాధవరం కృష్ణారావును భారీ మెజార్టీతో గెలిపించాలి

కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ



ఎన్విరాన్‌మెంటల్ ఎన్‌క్లేవ్‌లో కాలనీవాసులతో సమావేశంలో కార్పొరేటర్ సత్యనారాయణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని ఎన్విరాన్‌మెంటల్ ఎన్‌క్లేవ్ కమ్యూనిటీహాల్‌లో కాలనీవాసులతో ఆదివారం కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూకట్‌పల్లి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తున్నామని అన్నారు. తిరిగి ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అదే విధంగా కాలనీలో చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేశారు. గతంలో ఈ ప్రాంతంలో డ్రైనేజీ సమస్య విపరీతంగా ఉండేదని సెప్టిక్ ట్యాంక్ ద్వారా ఈ వ్యవస్థ ఉండేదని తెలిపారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి భూగర్భ డ్రైనేజీ లైన్ వేయించి సమస్యను పరిష్కరించారని గుర్తు చేశారు. అదేవిధంగా కాలనీలో రోడ్లు, కమ్యూనిటీహాల్ నిర్మాణం చేసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతోంది

• బూత్ అధ్యక్షుల సమ్మేళనంలో బీజేపీ అగ్రనేతలు
• హాజరైన జిల్లా నేతలు, నియోజకవర్గ పోలింగ్ బూత్ అధ్యక్షులు



కూకట్‌పల్లి ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్స్‌లో జరిగిన పోలింగ్ బూత్ అధ్యక్షుల సమ్మేళనంలో డా. కె లక్ష్మణ్, మురళీధర్‌రావు, నాయకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్స్‌లో అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం కూకట్‌పల్లి నియోజకవర్గ స్థాయి పోలింగ్ బూత్ అధ్యక్షుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా రాజ్యసభ సభ్యులు డా. కె. లక్ష్మణ్, మధ్యప్రదేశ్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మురళీధర్‌రావు, గోవా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సదానంద్ సేట్, కర్ణాటక మాజీ మంత్రి సుధాకర్ పాల్గొన్నారు. గౌరవ అతిథులుగా మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సూర్యారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, మూసాపేట కార్పొరేటర్ మహేందర్‌లు హాజరయ్యారు.

◆ **గ్రూప్ 1,2 పరీక్షలు సరిగా నిర్వహించలేని అసమర్థ పాలన..**

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనపై తెలంగాణ రాష్ట్ర ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. నిరుద్యోగుల ఉసురు తీస్తూ వారి జీవితాలతో ఆటలాడుతు ఉన్నారని, కనీసం గ్రూప్ 1,2 పరీక్షలు సరిగ్గా నిర్వహించలేని అసమర్థ పాలన కేసీఆర్ ప్రభుత్వానిదేనని అన్నారు. కనీసం ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తారీఖు జీతాలు చెల్లించే పరిస్థితి లేదన్నారు.

◆ **కేంద్రం ప్రభుత్వ నిధులతోనే ఫ్లైఓవర్లు ఇతర నిర్మాణాలు**

తెలికపాటి వర్షాలకే హైదరాబాద్, వరంగల్ వంటి ముఖ్య నగరాలు జలదిగ్బంధం అవుతున్నాయని అన్నారు. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం ఏ రంగంలోనూ అభివృద్ధి చెందలేదన్నారు. కేంద్రం ప్రభుత్వ నిధులతో ఫ్లై ఓవర్లు, ఇతర నిర్మాణాలు చేపట్టి తాము ఈ నిర్మాణాలను చేయిస్తున్నామని గొప్పలు చెప్పుకోవటం బీఆర్ఎస్ నాయకులకే చెల్లిందన్నారు.

◆ **సొంత పార్టీ కార్యకర్తలకే సంక్షేమ పథకాలు**

దళిత బంధు, బీసీ బంధు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేవలం సొంత పార్టీ కార్యకర్తలకే అందిస్తూ అర్హులను పక్కన పెట్టి వారి కన్నీళ్లకు కేసీఆర్ కారణమవుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి తిరిగి అప్పులు తీర్చేందుకు ప్రభుత్వ భూములు, ఆస్తులు అమ్మి పాలనను కొనసాగించే దౌర్భాగ్య స్థితిలో కేసీఆర్ ప్రభుత్వం ఉందన్నారు.

◆ **ఓటర్ రీవెరిఫికేషన్ వేగవంతం చేయాలి...**

బీజేపీ పోలింగ్ బూత్ అధ్యక్షులు ఓటర్ రీ వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ప్రతి బీజేపీ కార్యకర్త తానే ఎమ్మెల్యే అభ్యర్థిగా భావించి బీజేపీ గెలుపుకు నాంది పలకాలని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మహిళా మోర్చాతో పాటు వివిధ మోర్చాల విభాగాలు, శక్తి కేంద్రం ఇన్‌చార్జీలు, పోలింగ్ బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

100 రోజుల ఆర్టీసీ పండుగ షురూ

రాయదుర్గం: పర్వదినాలను పురస్కరించుకొని 100 రోజుల టీఎస్ఆర్టీసీ పండుగను ఆరంభించినట్లు గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపోలో ఉద్యోగులు, అధికారులతో కలిసి ఆయన ఆదివారం పండుగ సంబరాల పతాకాన్ని ఆవిష్కరించి సంబరాలపై వారికి వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం దసరా, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి పర్వదినాలు వరుసగా 100 రోజులలో ఉన్నాయని, ఈ సందర్భంగా సకాలంలో ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలు చేర్చే బాధ్యత మనదేనన్నారు. హెచ్‌సీయూ డిపో అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ ప్రశాంత్, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి



కూకట్‌పల్లి వైద్యాధికారి డా.రామ్‌కుమార్‌ను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

మూసాపేట: కూకట్‌పల్లి వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రామ్‌కుమార్ ఆదివారం మూసాపేట యూపీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక ఆధ్వర్యంలో డాక్టర్ రామ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలచారు. అందుకు కావాల్సిన వైద్య సేవల కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. సక్రమంగా విధులు నిర్వహిస్తూ వైద్య సేవల పట్ల సంతృప్తి చెందాలని వైద్యులను, సిబ్బందిని అభినందించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో యువకుడి మృతి



మృతి చెందిన గరక శ్రీను

భాగ్యనగర్‌కాలనీ: ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ ఖానాపూర్‌కు చెందిన గరక శ్రీను (24) కేబుల్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ప్రగతినగర్ వైపు నుంచి (ఏపీ11 ఏఆర్ 5552) తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలోనే కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోకు చెందిన (ఏపీ 29జెడ్ 2654) బస్సును డ్రైవర్ అజాగ్రత్తగా నడిపి ద్విచక్ర వాహనదారుడిని ఢీకొట్టాడంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న కూకట్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతిడి వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

కార్పొరేటర్‌కు సన్మానం

ఓల్డ్ బోయిన్‌పల్లి: డివిజన్‌లోని వెస్లీ టీచర్స్ కాలనీ అభివృద్ధికి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ఎనలేని కృషి చేశారని కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య అన్నారు. ఆదివారం కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు కొసల్యయాదవ్, రాధ, సుమిత్ర, బాగ్యమ్మ, సత్యనారాయణ, శ్రీనివాస్‌రావు, చంద్రశేఖర్, రామారావు, సాయన్న, చారి, పాపారావు తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌ను సన్మానిస్తున్న వెస్లీ టీచర్స్‌కాలనీ ప్రతినిధులు

వైభవంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

అమ్మవారి ఆలయాల్లో మొదలైన పూజలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మొదటి రోజు అమ్మవారు బాలత్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమించారు. ఉపవాసంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పలు దేవాలయాల్లో దుర్గామాత మాల వేసుకున్నారు.

– కూకట్‌పల్లి జోన్ బృందం



సుమిత్రనగర్‌లో అమ్మవారికి పూజా ద్రవ్యాలు సమర్పిస్తున్న కార్పొరేటర్ రోజాదేవి



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు, ఇన్‌సెట్ వనబాల దేవిగా రేణుకాఎల్లమ్మతల్లి



అమ్మవారి మాలధారణలో పూజలు చేస్తున్న కనకదుర్గ ఆలయం చైర్మన్ సత్యనారాయణ



మేనిఫెస్టో అన్నివర్గాలకు ఉపయోగకరం



ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన వివేకానందనగర్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు

ఆల్విన్‌కాలనీ: బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడుతుందని కార్పొరేటర్లు మాధవరం రోజాదేవి, నార్నే శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, నాయకులతో కలిసి ముఖ్యమంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రభుత్వం ఎన్నో గొప్ప పథకాలు తీసుకొచ్చిందన్నారు. అదే విధంగా ఆదివారం ప్రకటించిన మేనిఫెస్టోలో మరిన్ని పథకాలను చేర్చారన్నారు. దీనిని ప్రజలు దృష్టిలో పెట్టుకుని బీఆర్ఎస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

హైటెక్స్ గ్రౌండ్స్‌లో గ్రీన్‌థాన్

మాదాపూర్: ప్రతి రోజూ వ్యాయామం చేయడం, కనీసం 8 గంటలు నిద్రపోవడం వల్ల అందరికీ తప్పని సరిగా అవసరమని కిమ్స్ ఆసుపత్రి సీఎండి డాక్టర్ బి.భాస్కర్‌రావు తెలిపారు. మాదాపూర్‌లోని న్యాక్ హైటెక్స్ గ్రౌండ్స్ వద్ద కార్పొరేట్ ప్రొఫెసనల్స్ ఫిట్ నెస్ , ఆరోగ్యకరమైన, చురుకైన జీవనశైలిని అవలంభించేలా ప్రోత్సహించడానికి ఆదివారం ఫ్లాగ్ షిప్ కార్పొరేట్ గ్రీన్‌థాన్‌ను నిర్వహించారు. సీఐఐతెలంగాణ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో 3కె, 5కె, 10కె విభాగాలలో నడిచారు. గ్రీన్‌థాన్‌లో గెలుపొందిన విజేతలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల విలువైన హెల్త్ కార్డులను ఇస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బొలినేని భాసక్ర్‌రావు, టీఐఈ హైదరాబాద్ ప్రెసిడెంట్ మిస్ రషిదా అడేవాలా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి వేడుకలు



ఎల్లమ్మబండలో అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: శాస్త్రవేత్త, దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేషగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం అబ్దుల్ కలాం జయంతిని ఎల్లమ్మబండలోని గుడ్ విల్ హోటల్ చౌరస్తాలో నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. రామేశ్వరం నుంచి రాష్ట్రపతి భవన్ వరకు... పేపర్‌బాయ్ నుంచి ప్రెసిడెంట్ వరకు సాగిన ఆయన జీవన ప్రస్తానం యువతరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, గౌరవ అధ్యక్షుడు అనిల్ రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, షౌకత్ ఆలీ, మున్నా, ఖాజా, అగ్రవాసు, సంగమేష్, కె.నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే గాంధీ జన్మదిన వేడుకలు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరెకపూడి గాంధీ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు ఆయనతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ర్యాలీగా ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భారీ గజమాలను క్రేన్ సహాయంతో వేసి అభిమానాన్ని చాటుకున్నారు. వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి ఎమ్మెల్యే గాంధీని శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, నాయకులు సమ్మారెడ్డి, అనిల్‌రెడ్డి, సంజీవరెడ్డి, పెద్ద భాస్కరరావు, నాయినేని చంద్రకాంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.



భారీ గజమాలతో ఎమ్మెల్యే గాంధీని సత్కరించి అభిమానాన్ని చాటుకుంటున్న అభిమానులు



ఎమ్మెల్యే అరెకపూడి గాంధీతో కేక్ కట్ చేయిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్



పూల మొక్క అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ రోజాదేవి